


రచయిత	:	డా॥ దాశరథుల బాలయ్య
తల్లిదండ్రులు	:	భూదేవి, నర్సయ్య
జననం	:	మిట్టపల్లి, మం॥ సిద్ధిపేట, జి॥ మెదక్,
విద్య	:	ఎం.ఏ., ఎం.ఫిల్., పి.హెచ్‌డి.,
ఉద్యోగం	:	తెలుగు లెక్చరర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధిపేట - 502 103,

ముద్రిత రచనలు :

1. శ్రీ సంగమేశ్వర వినుతి (శతకం)
2. శ్రీరామ చంద్రోదాహరణం (కావ్యం)
3. బాసర జ్ఞాన సరస్వతీ మధ్యాక్కరలు (శతకం)
4. భక్త రామదాసు జీవితం, రచనలు (ఎం.ఫిల్. సిద్ధాంత గ్రంథం)
5. భక్త రామదాసు సంపూర్ణ కీర్తనలు (198 కీర్తనలు పూర్తి పాఠాలతో)
6. యాదగిరి శ్రీలక్ష్మీనరసింహోదాహరణం (కావ్యం)
7. శివ సాక్షాత్కారము (కోటి లింగేశ్వర శతకం)
8. ప్రణయోత్సవం (తెలుగు రుబాయీ కావ్యం)
9. ఆర్యాశతి (సంస్కృతం)
10. రామాయణ యక్షగానములు (పి.హెచ్‌డి. సిద్ధాంత గ్రంథం)
11. శ్రీ దుర్గాస్తవః (సంస్కృతం)
12. అశ్రుఖడ్గం (వచన కవితలు)
13. బెజ్జంకి శ్రీలక్ష్మీనరసింహ శతకము
14. సారస్వత సాహస్రి (శ్రీ సరస్వతీ సహస్ర కావ్యం)
15. అమృత భారతి

అమృత భారతి



డా॥ దాశరథుల బాలయ్య

అమృత భారతి

(పద్య కవితాసంపుటి)

మాన్యులు, సహృదయులు -
ఆచార్య టి. కిషన్ రావు గారికి -
నమస్సులతో
దాశరథుల బాలయ్య
23/4/08

రచన

డా॥ దాశరథుల బాలయ్య

M.A. M.phil: Ph.D:

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారి ఆర్థిక
సహాయంతో ముద్రితం

జాతీయ సాహిత్య పరిషత్
సిద్దిపేట.

అంకితం :

అమ్మానాన్నలు

శ్రీమతి & శ్రీ భూదేవి-నర్సయ్య గారలకు.

కమ్మని స్తన్యమ్మునిచ్చి - కౌగిట జేర్చి ముద్దాడి
సమ్మతి రామాయణమ్ము - సకలమ్ము వినిపించినావు
అమ్మ! యీ నాకావ్యకన్య - 'అమృత భారతి'నిత్తు గొనుము
ఇమ్ముగ యిదికూడ నీకు - ఇష్టమౌ మనుమరాలగును.

పొలమున బోయిరేబవలు - పొందుగ సేద్యమ్ము చేసి
పలువురు మెచ్చునట్టులుగ - బంగారు పంటలు దీసి
ఇలలోన 'ధర్మరాజ'నగ - ఇంపైన కీర్తి వహించి
చెలువొందితివి నాన్నగారు! స్వీకరింపుము నాదు కృతిని.

-దాశరథుల బాలయ్య

*

"అమృత భారతి"- పద్యకవితా సంపుటి.
- డా॥ దాశరథుల బాలయ్య -
జాతీయ సాహిత్య పరిషత్- సిద్దిపేట శాఖవారి 116 వ ప్రకాశనము.

ప్రథమ ముద్రణ : 2008

ప్రతులు : 1000

వెల- 50/- రూపాయలు

ప్రతులకు :- **డా॥ దాశరథుల బాలయ్య**
ఇం.నెం. 12-4-89/6
సరస్వతీనగర్
సిద్దిపేట- 502103, జి॥ మెదక్, ఆం.ప్ర.
సెల్.9885223390.

ముద్రణ : ఉషోదయ ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
కంచరిబజార్, సిద్దిపేట.
సెల్ : 9848960934, 9963149982

ఆమోదవీచిక

అఖిల భారత సాహిత్య పరిషత్తుకు అనుబంధంగా పని చేస్తూ, ఆంధ్రావనిలో అగ్రగామియై, జాతీయ భావవాహినులను అంతటా ప్రసరింపజేస్తూ, పద్య, వచన రచనా సుమాల సౌరభాన్ని పంచుతూ దేదీప్యమానంగా వెలుగొందుచున్న జాతీయ సాహిత్య పరిషత్తు, సిద్దిపేట మణికిరీటంలో శోభాయమానంగా 116 వ కలికితురాయిగా, సుప్రసిద్ధ సంస్కృతాంధ్ర కవివర్యులు, ఆంధ్రోపన్యాసకులు, సరస్వతీ ఉపాసకులు డా॥ దాశరథుల బాలయ్య విరచిత పద్యసుధాభాండము "అమృత భారతి" ఖండకావ్యము ప్రకాశనమగుట హర్షణీయము, ఆమోదయోగ్యము

దృగ్విషయ భావాన్ననుభవించి సామాజిక స్పృహనాశించి, ఎట్టి ఆలోచననైనా సమాజమందు నిలపాలన్న ధ్యేయంతో ముందుకు సాగుతూ, "శ్రీరామ చంద్రోదాహరణ", కావ్యాలంకరణచే సాహిత్యపరిషత్తు, సాహితీలోకం సామాజిక సంస్కృతి, భక్తి భావాన్ని పులుముకొని సాహితీజ్ఞానాన్ని ఆవిష్కరించుకొనుట డా॥ బాలయ్య గారి సాహిత్య సృష్టి ఎంత భావాత్మకమో, జ్ఞాన రసఝురియో అర్థమవుతుంది.

వీరు సృజించిన ఉదాహరణలు, మధ్యాక్కఱలు, పరిశోధనలు, రుబాయిలు మరియు పద్య, వచన రచనాకృతులు ఆంధ్ర భారతి దర్పానికి నిదర్శనాలు, నిబద్ధతలు.

ప్రస్తుతకావ్యము "అమృత భారతి" 49 ఖండికలచే

రచింపబడి ఆంధ్ర పద్యపాఠక లోకాన్ని పీయూషాంబుధిలో ఓలలాడింపజేయుట నిజంగా పాఠకుల అదృష్టమేయని చెప్పకతప్పదు.

'వర్ణు వర్తు' ననుసరించి కావ్యము పరిపూర్ణమైన ఆవేశములో హృదయమునుండి వెలువడు ఒకానొక వాక్ప్రవాహము : అందుకే "కవిర్మనీషి పరిభూ: స్వయంభూ". వారు తమ ప్రతిభా వ్యుత్పత్తులలో జాతీయవాదాన్ని కవితాత్మంగా హృద్గతములను బహిర్గతపరచి జాతిని జాగృతం చేస్తున్నాడనుటలో ఏ మాత్రం సందేహం లేదు.

నిజమైన, నిక్కచ్చియైన జాతీయవాదులు భక్తితత్పరులు, రామదాసు కీర్తనల పరిశోధకులు, సాహిత్య సాధకులు, జ్ఞాన బోధకులునైన కవి డా: దాశరథుల బాలయ్య గారు పద్య ప్రక్రియ ద్వారా భావుకులకు సైతం సాహిత్య సౌభాగ్య, సౌగంధమిచ్చి, మెప్పింపజేయుట వారి కాల్పనిక వైశిష్ట్యమే గాని మరేమిగాదని పరిషత్తు పురోగతినికాంక్షించు నేను అభినందిస్తున్నాను.

ఇంతమంచి కావ్య కుసుమాన్ని మా జాతీయ సాహిత్య పరిషత్తు పక్షాన ప్రచురింపజేయుట మహద్భాగ్యముగా ఆమోదిస్తూ డా: బాలయ్య గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

శుభం భూయాత్.

అమ్మన చంద్రారెడ్డి,
అధ్యక్షులు,
జా.సా.ప. సిద్దిపేట.

కృతజ్ఞతలు

* ఈ కృతి ఆకృతి దాల్చడానికి ఆర్థిక సహాయమందించిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం హైదరాబాద్ వారికి–

* ఆమోద వీచిక అందించిన ఆత్మీయులు శ్రీ అమ్మన చంద్రారెడ్డి గారికి–

* అండగా నిల్చిన ఆప్తులు ప్రముఖ కథారచయిత శ్రీ ఐతా చంద్రయ్య గారికి–

* తమ సంస్థ పక్షాన ప్రచురించిన జాతీయ సాహిత్య పరిషత్ సిద్దిపేట శాఖ వారికీ–

హృదయపూర్వక కృతజ్ఞతలు.

–డా॥ దాశరథుల బాలయ్య–

విషయ సూచిక

* * *

శ్రీ పదార్చన

కొలనులో వికసించిన కొమరు తమ్మి
పూలవంటి నీ దివ్య పాదాల జేరి
సన్నుతింతును సతము బాసరపురేశి!
ఓ దయారాశి! వేగ నన్నోమగదవె!

బాలభానుని కాంతిలా పరిఢవిల్లి
అంధకారమయమ్మైన యవనినంత
మేలుకొల్పుచు చేతన నూలుకొలుపు
నీదు పదకమలముల ధ్యానింతునంబ!

నవ శిరీష సుమాలో, క్రొన్ననలొ యనగ
మృదులమై సుకుమారమై మురువు గొలుపు
తావకీన సుందర పద ద్వయమునెపుడు
ప్రస్తుతించెదనమ్మ! శ్రీబాసరేశి!

బూది పూతలవానిచే పొగడబడిన
తమ్మికన్నుల వానిచే తలచబడిన
నాల్గుమోముల వానిచే నతులు గొనిన
శారదా! నీదు చరణాంబు జములు గొలుతు.

కవులమేలి జిహ్వాగ్ర భాగములయందు
సాధుపురుషుల హృత్కుశేశయములందు
నర్తనముసేయు నీపాదనళినములను
సంభజింతును శ్రీసరస్వతి! భగవతి!

పాపలతికా లవిత్రముల్, పావనములు
తీవ్ర దు:ఖ తమముబాపు దీపములును
ఉరుభవాబ్ధిని దాటించు తరణములును
శారదాంఘ్రి యుగమ్మునే సంస్మరింతు.

పుణ్యగౌతమీ జలములు, పుల్లకుసుమ
సంచయంబు, పారాణి, యక్షతలు, పసుపు
కుంకుమలు సమర్పించి పల్కుల వెలంది!
నీదు పదములు పూజింతు నిండుభక్తి.

దీనమై మ్లానమై సుంత దీప్తిలేక
హీనమై జీవితంబెల్ల హేయమయ్యె!
పసిడి కాంతులు కురిసి నాభావమందు
కదలిరావమ్మ! నీదివ్యపదము లెంతు.

కాలమంతయు కటిక చీకటులయందు
గడచిపోయెను దు:ఖాగ్ని గ్రాలు కొనగ
చలువనౌ నీ దయాసుధల్ చిలుకరింప
కదలిరావమ్మ! నీ దివ్య పదములెంతు.

కన్నులుండిననేమి? నీ కనక చేల
దీధితుల గాంచగావలె, దివ్యపాద
పద్మయుగళిని స్మరియించి పాడగవలె
ఆడగావలె తన్మయత్వమ్మునొంది.

ఓ మహోజ్జ్వల రూపిణీ! ఓ మదీయ
హృదయ సంవాసినీ! నిన్ను నెటులగందు?
ఎంత ద్రవ్వుకొన్నను గాని యింతవరకు
నీదు లోతెంతనో నేరనే మదంబ!

*

సూర్యస్తుతి

కమనీయంబగు కాంతి వైభవముతో
కారుణ్య భావంబుతో
గమనంబున్ బొనరింప వచ్చి జగతిన్
గాపాడు తండ్రీ! నినున్
సుమగుచ్ఛంబుల తోడ పత్రములతో
శుద్ధంపు నీరంబుతో
ప్రియమారంగను పూజసేతు గొనవే
శ్రీ సూర్య నారాయణా!

ఆలస్యంబనె మాటలేక కడు ర
మ్యాకారమున్ బూని యె
క్కాలంబైనను సంచరించెదవు లో
కాలన్ వెసన్ గావగా
నీలాధర్మము తప్పనట్టి విబుధున్
నిత్యానుకంపామతిన్
చాలన్ సన్నుతి సేతు బ్రోవగదవే!
ఛాయాపతీ! భాస్కరా!

చీకట్లన్ తొలగించువాడ! బ్రతుకే
చీకట్లతో నిండె! మా
చీకుల్ చింతలు మాన్పివేసి వెలుగుల్
చిందించి భూమండలిన్
నాకంబున్ బొనరించు వేలుపవు ని
న్నర్చింతు శుద్ధాత్మ! సు
శ్రీ కంబైన అనామయంబు నిడవే
శ్రీ సూర్య నారాయణా!

శ్రీ మద్దివ్య కళాతివైభవ! కృపా
సింధూ! నినున్‌గాంచి యీ
భూమీ చక్రమదెల్ల సంతసముతో
పొంగారు నిన్‌గొల్చినన్
క్షేమంబబ్బు రుజల్ దొలంగు మరి శ్ర
శ్శ్రేయంబు సిద్ధించు నం
చో మార్తాండ! నమస్కరింతు గనవే!
ఓ సూర్య నారాయణా!

కమలంబుల్ వికసించు నీ వెలుగులన్
గన్నంతనే యంతటన్
కుముదంబుల్ ముకుళించు చిత్రముగ వా
క్రువ్వంగ శక్యంబె? నీ
యమితంబౌ మహిమన్, సమస్త జగదా
ధారా! నిరంతంబు సం
తమసంబున్ వెడలించి బ్రోవు మహితా
త్మా! సూర్య నారాయణా!

*

వాల్మీకి

రామామృత రసమానిన
ఓ మౌనీ! నాదుమదిని యూహించెద నీ
నామమ్మును - నీ విరచిత
రామాయణ కావ్యమెపుడు రంజిలు జగతిన్

శోకమ్మొక శ్లోకముగా
శ్రీకముగా సుందరమగు చిరకావ్యముగా
పాకముగా గూర్చిన - వా
ల్మీకీ! ముల్లోకములను మేటి కవివయా!

పుట్టితివట బోయగ- చే
పట్టితివట దుడ్డుకర్ర పాంథ జనమ్మున్
గొట్టితివట పెను జడలను
గట్టితివట - ఎట్లు నీవు కవివయ్యితివో!

'శరణాగత రక్షణకై'
'పరమంబగు ధర్మనిరతి పాలించుటకై'
కరుణాసాగరుడగు - రఘు
వరు చరితము వ్రాసినావు వాల్మీకి కవీ!

యోగనిష్ఠయందుననె నీ వుండు కతన
చుట్టు పెరిగెను పెద్దని పుట్టయొకటి
అట్టి పుట్టను జూచి మహాత్ములంత
మెచ్చినారట నిన్ను 'వాల్మీకి' యనుచు.

ఓ వాల్మీకి మునీంద్ర! నా మనము నం
దూహింతు నీ నామమున్
నీ వైదగ్ధ్యము నీ కవిత్వరుచులున్
నీ కావ్య మాధుర్యముల్
భావానందము కల్గజేయు మరి సం
ప్రాప్తింపగా జేయు శ్రీ
కైవల్యమ్ము! సతంబు నీకిదె నమ
స్కారంబు గావించెదన్

*

ఆమె

ఆమె రమణీయమూర్తి ! సుధాంశు రేఖ !
అమృత రసవాహిని మనోజ్ఞ సుమదళమ్ము
ఆమె విశ్వ సమ్మోహిని! మామకీన
హృదయవేదన తొలగించు ప్రేమరాజ్ఞి !

ఆమె వెన్నెల తునక ! అందాల మొలక !
కనులముందర కనిపించు కాంతి కళిక !
ఆమె నా యెద వలపుగా నవతరించె
ఆమె గిరిజలా మృదులాస్యమభినయించె.

ఆమె లాలిత లావణ్య సీమయగును
నాదు ప్రణయ వీణా మృదునాదమగును
నీల నీలాంబరాల చాంద్రీపదమ్ము
ఆమె తీయని ఊహాగా హాయి గొలుపు.

ఎవరి కోసము రగులు నీ హృదయమెల్ల
ఎవరి కోసము ఈ కళా సృష్టియెల్ల
ఆమె శాంతి దేవతయగు నామె కొరకె
ఆ మహాసిద్ధి కొరకే అనంత తపము.

వైక్లబ్యగీతం

ఇది మహాధ్వాంత మందిరమిది నితాంత
బంధనాలయ మిచట నిబర్హణమ్ము
సాగుటేకాని హృద్వీణ మ్రోగదెపుడు
ఇట ననంత క్షుధాక్రందమే సతంబు !

శిథిల నిర్జీవ నిశ్శబ్ద జీవనములు
చిమ్ముకొని వచ్చు దుఃఖాశ్రు శీకరములు
అదరిపోయిన గుండె సవ్వడులె కాని
మసృణ దరహాస మాధురీ మహిమలేవి ?

కఠిన విషభావ కీలానికరమెగాని
మధుర పీయూష భావ నివహము లేదె !
మోడులే బీడులే కాని మురువుసూపు
నవ వికస్వర రుచిర సూనాలు గలవె !

*

కరువు కరాళ నృత్యం

చినుకు రాల్చనొక్క చిరుమబ్బు కనరాదు
పంటలన్ని యెండి మంట గలిసె
గొడ్డు గోదకింత గడ్డిలేనే లేదు
కరువు వచ్చె - బ్రతుకు బరువు హెచ్చె.

పచ్చి మొలక కానబడదెందు జూచిన
నీరు లేదు నిలువ నీడలేదు
బీటవారె భూమి - బిక్కజచ్చె పశులు
రైతు గుండె యెండి రగులు చుండె

బ్రతుకు దెరువులేక వలస వెళ్ళిన గాని
కూలి దొరకకెంతొ కుమిలినారు
గంజిమెతుకు కూడ కరువయ్యె జనులకు
వీరి నాదరించు వారలేరి ?

బావులెండె 'బోరుబావులు' ఎండెను
వాగువంక లెండె పైరులెండె
త్రాగునీరు లేక తల్లడిల్లిరి ప్రజ
సాగు నీరు లేక సర్వమెండె.

గ్రీష్మము

వచ్చుచున్నాడు సూర్యుడు - రెచ్చిపోయి
ప్రాగ్దిశోన్నత పర్వతాగ్రాలనెక్కి
'చండి' ఫాలస్థ కుంకుమచ్ఛవి యనంగ
ప్రథిత తీవ్రోగ్ర రుద్ర నేత్రాగ్ని యనగ.

వచ్చుచున్నాడు భానుడు- పెచ్చు పెరిగి
కఠిన కర్కశ రూక్ష వీక్షణము లెగయ
పరగ దూర్వాస మౌని కోపంబనంగ
క్రుమ్ముకొని వచ్చు రుధిర పిండమ్మనంగ.

అగ్గి కురిపించుచున్నాడు- భగ్గుమంచు
మండుచున్నాడు - నింగి మార్తాండుడంత
చుక్కనీరైన లేదాయె బిక్కుమంచు
పరితపించె గ్రీష్మాన జీవాళియెల్ల.

*

ప్రజల జీవితములె పాడగలను

నా దేశమంచును నా జాతియంచును
మక్కువ నాకెంతొ మదిని గలదు
కాని- నా హృదయమ్ము కాలిపోవుచునుండ
ఒక్కడైనను నాదు దిక్కుగనడు
నాదు సంస్కృతియన నాకెంతొ గర్వమ్ము
నా భాషయనగ నానందమగును
కాని- నా బ్రతుకెంతొ కన్నీరు గార్చగ
ఓదార్చలేడు నన్నొక్కడైన

గౌతమీ జాహ్నవీ కావేరి కృష్ణ- నీ
రమ్ములు అమృతమయమ్ములెయగు
కాని- నా గొంతెండి గాసినొందుచు నుండ
చుక్క నీరందించడొక్కడైన
దేశమనగనేమి? దేశీయతేమిటి ?
కులము మతముగాదు బలముగాదు
బాధ చెందునట్టి ప్రజల జాతేనాది
ప్రజల జీవితములె పాడగలను.

*

తెలంగాణ వెలుగులు

పండ్లు పటపట గొరుకుచు ప్రభునిజాము
పైన కన్నెర్ర జేసిన ప్రజలదలతు
విప్లవాగ్నులు రగిలించి వెలుగు కొరకు
ప్రాణమర్పించినట్టి ధీవరుల గొలుతు.

పిచ్చిగా రజాకారులు రెచ్చిపోయి
స్త్రీల చెరబట్టి శీలమ్ము చెరిచినపుడు
వారిపై పోరు సలిపిన ధీరులకును
చేతులెత్తి నమస్కృతుల్ చేయుచుందు.

ఓరుగల్ కోటనెక్కిన వీరుడెవడు ?
మన పతాకమ్మునెగురవేసినదెవండు ?
ఎవడు ప్రాణమ్ములొడ్డి సాగించె రణము
అట్టి మొగులయ్యకెపుడు జోహారుసేతు.

స్వామి రామానంద తీర్థ సత్యాగ్రహమ్ము సాగించె
రామకృష్ణుండు బూరుగుల రణమవారణ రీతి జేసె
ప్రేమ వందేమాతరమును విద్యార్థి లోకమ్ముపాడె
కైమోడ్పులిట్టి వీరులకు గావింతు భావింతు మదిని.

సతతం బెంతు సురవరం
ప్రతాపరెడ్డిని తెలుంగు వైతాళికునిన్
నతులింతు మాడపాటిని
అతులిత ధీమణిని సుందరమ్మను దలతున్

తెలగాణ ప్రజల బ్రతుకుల
వెలుగులు గూరిచిన వీర విక్రమధనులన్
దలతును తెలతును నిత్యము
గొలుతును కవనంపు పూల గుత్తుల తోడన్.

*

వాడే కవి !

వాడే కవి ! ఎవడైతే
పాడగ గలడో జనాళి బాధలనెపుడున్
చూడగ గలడో బ్రతుకును
వీడగ గలడో అహితపు వెఱ్రిపలుకులన్

వాడే కవి ! ఎవడైతే
గోడల జాడలను జూచి కూల్చగ గలడో
నీడల తరుమగ గలడో
పీడన విరుగడగచేయ పిడికిలియెత్తున్

వాడే కవి ! ఎవడైతే
కూడును గుడ్డను జనులకు కూర్చగ గలడో
బీడౌ బ్రతుకుల - పచ్చని
మేడై బాసటగ నిల్చి మేలొనరించున్

వాడే కవి ! ఎవడైతే
పాడునొ తా గజ్జెకట్టి పల్లెపదములన్
వేడిగ మరివాడిగ జన
నాడులు స్పందించునట్లు నాట్యము చేయున్.

పద్యము

పద్యము పద్యమే ! ఎవరు పల్కిన పల్కకపోయినన్ సరే !
పద్యమె హృద్యమౌ ! ఎవరు పాడినపాడకపోయినన్ సరే !
పద్యమె సంతసంబిడును పద్యము శాశ్వత కాలముండెడున్!
పద్యమె నాకు ప్రాణమగు పద్యపు విద్యకు సాటియున్నదే !

కలువలు పూసినట్లు కమ
కమ్మని తావులు వీచినట్లు కో
కిలములు కూసినట్లు చెవి
కింపుగ రాగము తీసినట్లు వె
న్నెల విరబూసినట్లు ధరణిన్
గుడిగంటలు మ్రోసినట్లు తే
నెలు ప్రవహించినట్లు రచి
యింపవలెన్ తీయతీయ పద్దెముల్

అదె వాహిని అదె మోహిని
అదియే ఒక అమృతమూర్తి అదె ప్రణయినియౌ
అదె నా హృదయపు గేహిని
అదె ఉదయిని అదియె పద్యమది మదికింపౌ.

అదియే నా ప్రాణేశ్వరి !
అదియే నా ప్రేమమూర్తి ! అది దేవతయౌ
అది నా జీవిత రథ సా
రథియౌ ఆ పద్యమునకె ప్రణతులుసేతున్

*

భారత భాగ్య విధాత

మధ్యాక్కరలు :

మాయమ్మ భరతమాతకును మకుటమ్ము హిమవన్నగమ్ము
మాయమ్మ దాల్చు హారములు- మంగళ గంగాయమునలు
మాయమ్మ పట్టు వస్త్రములు- మంజు సస్యములు సంపదలు
మాయమ్మ నుదుటి తిలకము మహిత కాశ్మీరమ్ముసుమ్ము

ఈ నేలమీద జనించిరెందరో పుణ్యపురుషులు
ఈ నింగియందు ఘోషించు నెన్నియో వేదనాదములు
ఈ నీట నమృతమ్ముకలదు ఈనిప్పు కల్మషహరము
ఈ నీవు నిచట పుట్టుటయునెదొ పూర్వపుణ్యమేయగును.

పుట్టినందుకు నీవు మాతృభూమిని పూజించవలయు
మట్టు బెట్టంగనే వలయు మనభూమి జొచ్చు శత్రువుల
పుట్టు దరిద్రులకింత బువ్వను పెట్టనే వలయు
పట్టిన పట్టు వీడకుర ! భారత భాగ్యవిధాత !

డబ్బు

డబ్బులున్నవాని 'డాబు' వేరే తీరు
ఆ "రుబాబు" వేరు 'జోరు' వేరు
వాడు పొందు గౌరవంబధికంబురా !
వాని మాటలెల్ల వసుధ చెల్లు

పదవి గలుగువాడు, పండితుడగువాడు
స్వామియైన వాడు, సద్గురుండు
ద్రవ్యమున్నవాని దరిజేర వత్తురు
ధనమె మూలమగును పనులకెల్ల.

ఖర్చు పెట్టువేళ కాస్త యోచింపుడీ !
కరిగిపోయినాక కలత యేల?
ధనము లేనినాడు " దర్జా " తనము పోవు
డబ్బులేని బ్రతుకు మబ్బు మబ్బు

*

సత్యఘోష

సత్యమైనదేదొ సరిగయోచించెద
సత్యమైనదెపుడు సరిగ చెప్పుదు
సత్యమైనదొకటె సరియగు జ్ఞానము
కులమతాలు వట్టి కుట్రసుమ్మి !

సత్యమార్గమేదొ సరిగ చూపించుచు
రచన సేయువలెను రమ్యముగను
ప్రజల హితముగోరి ప్రవచించుటే గొప్ప !
ధనము కోరు రచన ఘనముగాదు.

పుట్టినట్టివారు గిట్టుట తప్పదు
చావుగూర్చి యెవరు జంక వలదు
ధర్మకార్యములను త్వరితమ్ముగా జేసి
ప్రాణముండగానె పరము గనుడి !

ఫ్యాక్టరీలు నడిపి ప్రాజెక్టులను గట్టి
అందమైన బాటలతడు వేసె !
సకల వస్తువులను సమకూర్చె మనకయి
శ్రామికుండు ! వాని సన్నుతింతు.

జనము పెరిగె, పెరిగె ధనధాన్యరాశులు
ఇళ్ళుపెరిగె మరియు గుళ్ళుపెరిగె
అన్నిపెరిగె నట్లె అవినీతి పెరిగెను
అక్రమాలనెవడు ఆపగలడు ?

జన్మనిచ్చెనామె చనుబాలనిచ్చెను
పెంచి పెద్దచేసె ప్రేమజూపె
మాటనేర్పె బ్రతుకు బాటను చూపెను
తిట్టరాదు స్త్రీని కొట్టరాదు.

కట్న కానుకలని కాల్చుకతిందురు
నీతి విడిచినట్టి నేటి జనము
అతనికామె యెంతొ- ఆమెకు అతనంతె!
ఎక్కువెవరు ఇందు తక్కువెవరు ?

*

ఓసి దారిద్ర్యమా !

బలవంతుడగువాడు బలహీనునిగమారు
మిత్రుండు దూరమై మెలగుచుండు
లక్షాధికారియు భిక్షుజీవిగ మారు
పండితుండును మారు పామరునిగ
సంపన్న గృహమేమొ సౌఖ్యము గోల్పోవు
ప్రభువు బంటుగమారి పరితపించు
పలుకరించెడివారు పలుకరించకపోగ
తనవాడు సైతము తగవులాడు

ఓసి దారిద్ర్యమా! నిన్నునూహసేయ
కంపనము పుట్టు నెంతమగానికైన
నీవు కూడ దేవతవని నిఖిలజగతి
చాల మ్రొక్కిన నీకేల జాలిలేదె !

*

ఎంతదాక.....

వెలుగువచ్చెననుచు తలపోయునొక్కడు
చీకటున్నదనుచు చెప్పునొకడు
ఎంతదాక నరుడు హింసింపబడుచుండు
నంతదాక చీకటన్న మాటె !

ఎన్ని శాస్త్రములను యెరిగినప్పటికైన
ఎంత ప్రతిభ తనదు సొంతమైన
ఎంతదాక తన్నునెరుగడో మనుజుండు
అంతదాక వాడు అజ్ఞుడెయగు !

ఎంత ద్రవ్యమున్ననేమి లాభమ్మురా !
బంధులెందరున్న ఫలితమేమి ?
ఎంతదాక శాంతి యెదలోన నుండదో
అంతదాక బ్రతుకు వ్యర్థమెయగు.

*

రైలు పట్టాలు

అసురలోకములను అసురభావములను
సృష్టి చేయుటకును తృష్ణలేల ?
మారణాయుధాల మసిచేయగావలె
శాంతి లేని జగతి జగతియగునె ?

ఎన్ని బాంబులనైన సృజించవచ్చు
ఎంత నెత్తురునైన చిమ్మించవచ్చు
ఎన్ని దేశాలనైన కూల్చేయవచ్చు
జగతి దీపించదెపుడు హింసాపథాన .

ఎవడహింసాగుణవ్రతుడెవడు నిత్య
సత్యవచనుడు విశ్వైక శాంతిదూత
అట్టి గాంధీ మహాత్ముని యడుగుజాడ
లందు పయనించగావలె నఖిల జనము

ఎటు జూచిన యుద్ధములే !
ఎటు జూచిన యంధకారమే దుఃఖములే
ఎటు జూచిన చిటపటలే
కటకటలే !జనులకెట్లు కలుగు సుఖంబుల్.

ధరణి శాంతించవలెనన్న తత్త్వవిద్య
మరియు విజ్ఞాన శాస్త్రము విరియవలయు
ఖగము ఎగురునే రెండుపక్షాలు లేక
రైలు కదలునె రెండుపట్టాలు లేక.

ఓ పతాకమా !

భరతపుత్రులు శౌర్యపటిమగలారంచు
ఎర్రనెర్రని కాంతులెగయుచుండ
ధర్మబుద్ధిని జీవితంబు సాగింత్రన
తెల్లతెల్లని రంగు తెలుపుచుండ
సౌభ్రాత్రముననొప్పు సహనశీలురనంగ
పచ్చపచ్చని ప్రభల్ బరగుచుండ
పరతంత్ర తిమిరమ్ము పారద్రోలుదురన
ధర్మ చక్రమ్ము సుందరతనొప్ప
నీలిగగనాలలో రమణీయమైన
ఆకృతిని బూని రెపరెపలాడుచుండి
మూడు వన్నెలతో మమ్ము మురియ
జేయు
ఓ పతాకమా ! వందనమొనరజేతు.

*

మహాత్మా !

నీ బోసి నవ్వులో నిండు పున్నమినాటి
వెన్నెల కెరటాలు విస్తరిల్లు !
నీ కంటి చూపులో నెరయు దాక్షిణ్యము
జాలువారును పాలసంద్రము వలె
నీ ముద్దు పలుకులో నిఖిల మానవ జాతి
మమతానురాగాన మసలుచుండు
నీ సత్యదీక్షలో నిర్వీర్యమైపోవు
నిర్వార శస్త్రాస్త్ర నికరమెల్ల

శాంత్యహింసల తోడనే సకల జగతి
నిత్య సుఖ జీవనమున రాణించునంచు
తెలిపినాడవు నీవు గాంధీ మహాత్మ !
మాటిమాటికి నీకివే యేటికోళ్ళు !

*

టంగుటూరి

పూని స్వాతంత్ర్యసంగ్రామ భూమియందు
సాహసంబున దూకి నిస్వార్థముగను
అంగిలేయుల చీల్చి చెండాడగాను
సింగమై లేచి గర్జించె టంగుటూరి.

పేదరిక మనుభవించెను పిన్ననాడె
చీకుచింతలు చవిజూచె చిన్ననాడె
తనను చదివింపగానెంచి- తల్లి తుదకు
పట్టు చీరను తాకట్టు పెట్టెసుమ్మి !

కీర్తి పొందెను గొప్ప వకీలుగాను
ప్రజల ఆర్తిని తొలగించి పాటుపడెను
తెల్లదొరలను ఎదిరించి ధీటెసంగ
కేసరై ప్రకాశించె విభాసురముగ.

కన్న తండ్రిగ ప్రజలను గాచినాడు
నిరుపమానమౌ సేవలందించినాడు
ముఖ్యమంత్రియై మరి త్యాగమూర్తియైన
టంగుటూరికి కోటొక్కచెంగనాలు.

శ్రీ వీరేశలింగం

ఎవ్వాని కావ్యాలు రవ్వల్ల కాంతితో
వెలిగెనో భారతీగళమునందు
ఎవ్వాని సంపద యిసుమంత మిగులక
కరిగెనో దీనుల గాచుటకును
స్త్రీ జనోద్ధరణకై చేసెనెవ్వాడు - సం
స్కరణలెన్నెన్నొ నిస్వార్థముగను
సంఘాన గల దురాచార పిశాచాల
గరిమతో నెవ్వాడు తరిమికొట్టె

అతడు వీరేశలింగాఖ్యుడతని కాంధ్రి
సతము ఋణపడియుండును - అతని వంటి
సచ్చరిత్రుడు సంఘసంస్కర్త లేడు
అట్టి మహనీయ మూర్తినేనభినుతింతు.

*

ఘంటసాల

కంఠమన్నచో కంఠంబు కాదతనిది
కంచుకంఠమే యగును- లోకంబునందు
ఘంటసాలకు మించిన గాయకుండు
కానరాడింత వరకు విఖ్యాతుడతడు

అతని గాత్రమందమృత భాండమ్ముగలదు
భాష యందున సాగర ఘోషకలదు
పండితులు పామరులు పసిపాపలెల్ల
పరవశింతురు ఆతని పాటలు విని.

అతని "గీత" ను విన్నచో యఘము తొలగు
భక్తి పాటలు విన్నచో ముక్తి కలుగు
అన్ని రోగాల కౌషధంబతని పాట
అతనికాతడే సాటియంచభినుతింతు.

*

మదర్ థెరిస్సా

మదరెవ్వరనాథలకును
మదరెవ్వరు దుఃఖితులకు మతిహీనులకున్
మదరెవ్వరు ఈ జగతికి
మదరుథెరిస్సాయె గాక మరియెవ్వరాకో!
    ఆయమ్మే కరుణామయి !
    ఆయమె బంగారు తల్లి! అఖిల జనులకున్
    ఆయమయే దేవతయగు
    ఆయమ లేదనగ మనసు ఆతురతపడెన్

పేదల చూచినదెవ్వరు!
పేదల కన్నీరు తుడిచి వేసినదెవరో !
పేదల తాకినదెవ్వరు !
పేదల ప్రేమించి బువ్వపెట్టినదెవరో !
    లాలించెను అన్నార్తుల
    పాలించెను భిక్షువులను బాధాజనులన్
    మేలెంచెను ఆయమ్మే
    చాలించెను తనువు నేడు జగతి వదంకన్

కలకత్తా వీధుల ఆ
కలి జీవుల రోగులగని కారుణ్యముతో
పలుసేవలు చేసిన దీ
నుల పాలిటి దేవతయని నుతియింతుమదిన్.

దుఃఖగీతి

ధైర్యమున్నదెల్ల తగ్గిపోవుచునుండు
చదువు సంధ్యలన్ని మదిని తొలగు
ఎట్టిపనులు చేయ ఇష్టమేయుండదు
దుఃఖమందు- బ్రతుకు దుమ్ముపడును.

మొగము కాంతితగ్గి- సగమౌను మనుజుండు
వయసురాక ముందె వచ్చు ముదిమి
మనసు బాగులేక మౌనముద్ర వహించు
కురులు వెల్లవెల్ల గోచరించు.

అర్ధరాత్రి లేచి ఆలోచనలు చేయు
ఉలుకు పలుకులేక యొంటిగుండు
తనలో తానె యేదొ తలపోసి తలపోసి
క్రుంగిపోవు తుదకు వంగిపోవు.

శోకమున్న యిల్లు-"చీకటి కోణాలు"
శోకమున్న చోట శోభలేదు
దుఃఖభూతమెవడు దునుమాడునో వాడె
ధీరుడగుచు జగతి తేజమొందు.

*

కుల నిర్మూలన

కులము వలన పెరుగు కుటిల భావమ్ములు
కులము వలన సన్నగిలును ప్రేమ
నర సమాజమెపుడొ నాశనమాయెను
కులము వలన ప్రగతి కుంటువడెను!

కులము కులముకొక్క కులసంఘమాయెను
ఇతర జనుల నీసడించుటాయె
కొన్ని పెద్దవనుచు కొన్ని చిన్నవియన్న
నిక్కముగను జాతి ముక్కలగును.

గాలిదేమి కులము రాలదేమి కులము
పూలదేమి కులము పాలదేది?
వ్యాసుకులమదేమి వాల్మీకిదేమిటి?
వదలవలయు రిత్తవాదములను

భాస్కరుండు తూర్పు భాసించినంతనె
పారిపోవునంధకారమెల్ల
ఎడద పూచినపుడు మిడిమిడి భావాలు
తొలగిపోవు వెలుగుకలుగు మిగుల

ఏల ?

ఏల నేనగ్నికీలనై యెగసిపోదు
నుగ్రనరసింహమూర్తినై యుద్ధమింతు
ఏల నే ఫాలనేత్రమై యెల్లవేళ
మండిపోవుదు లోకాల గుండెలదర

ఏల మేఘంబువోలె గర్జింతునేను?
ఏల సంద్రంబువోలె ఘోషింతు నేను?
ఏల బుసగొట్టు క్రోధనాగేంద్ర మవుదు
నేల సుడిగుండమవుదు త్రిశూలమవుదు?

చంద్రనిప్పులు చెరగు ప్రచండ భాను
బింబమౌదును నేనేల పిడుగునౌదు?
అతి భయంకర బాధాతరంగ మౌదు?
ఏల నిట్టూర్పునౌదు కన్నీరునౌదు?

*

ప్రభూ!

మేల్కొల్పురా నన్ను మేల్కొల్పురా ప్రభూ!
దుఃఖజీవుల బాధ తొలగజేతు !
నడిపించరా నన్ను నడిపించరా ప్రభూ!
దారిలో నున్న ముళ్ళేరివేతు !
వెలిగించరా నన్ను వెలిగించరా ప్రభూ!
చీకట్లు కొన్నైన చీల్చివేతు !
పలికించరా నన్ను పలికించరా ప్రభూ!
అనురాగ రాగాల నాలపింతు!

నీవు నాగుండె గూటిలో నిలిచినావు
నన్ను దీవించు మనుచుంటి నిన్నుజేరి
విశ్వకళ్యాణమెంచి జీవితమునెల్ల
ముడుపు గట్టితి నీకు సమ్మోద మలర

*

తెలుగు భాష

తిన్న తిన్నగ విచ్చుకొన్న గులాబిలా
తీయతీయని తేనె తేటవోలె
ఘల్లు ఘల్లని మ్రోయు కాలిగజ్జెలవోలె
చల్లని మల్లె పందిళ్ళవోలె
మేలైన చంద్రుని పాలవెన్నెలవోలె
తురగలించెడు నీటి తరగవోలె
తళుకొత్తునట్టి రసాలసాలమువోలె
కమ్మని కోకిల గానమువలె

సరసమై కోమలంబునై శ్రవణసుభగ
మై లలితమై మనోహరమైన భాష
తనివి తీరదు ఎంత పల్కినను గాని
తీపి పలుకులయోష ! మా తెలుగుభాష !

*

ఓ సరస్వతీ...!

బరువు బరువుగా హృదయము మరిగినపుడు
మనసు చెదరగా నిద్దుర మరచినపుడు
పొరలి పొరలి కన్నీళులు కురిసినపుడు
ఓ సరస్వతీ ! నీవు నన్నూరడింతు !

వాడిపోయిన తీగెకు మ్రోడులకును
చితికిపోయిన దుఃఖ జీవితములకును
తావకీన పదాబ్జ సుందర దళముల
ఛాయలోన గూర్చు తీరని హాయి నిజము !

నాదు హృదయమ్ములో నీవు కదలగానె
ఏవొ కమ్మని తావులు ఏవొ మధువు
లేవొ పున్నమరేలు మరేవొ మంచు
చినుకులగుపించు మురిపించు చిత్తమలర.

మామకీన జీవితపుటారామ మందు
వైజయంతీ పరీమళ వైభవములు
కలుగజేయుము బ్రతుకును వెలుగజేయు
మో సరస్వతీ ! నీకు నమో2స్తు సతము.

సంక్రాంతి లక్ష్మి

రాగ రసములు జిలుకుచు రమ్యమైన
ముగ్ధరూపము వహియించి ముంగిళులను
వచ్చి నిలిచిన సంక్రాంతి భామ ! నీకు
స్వాగతము సంతరింతు సుస్వాగతమ్ము !

అతివలుదయాన లేచి కలాపి జల్లి
తీరుతీరైన మ్రుగ్గులు తీర్చినారు
గుమ్మములపైన బంతిపూల్ గ్రుచ్చినారు
మామిడాకుల తోరణాల్ మలచినారు.

భోగిమంటలతో చలిపోవుచుండ
గొబ్బిదేవుళ్ళ భక్తితో గొలిచినారు
గంగిరెద్దులు వింతగా గంతులేసె !
రమ్ము సంక్రాంతి లక్ష్మి ! మాకిమ్ము శుభము.

తెలుగు పొలములు పచ్చగా తేజరిల్ల
తెలుగుటిండ్లు ధాన్యాలతో దీప్తులెసగ
గుండె గుండెలో శాంతిని గూర్చుటకును
కదలిరావమ్మ ! మకర సంక్రాంతి లక్ష్మి !

విజయదశమి

మహిషాసురుని మదమ్మణగార్చి లోకాల
కాపాడె నేడు శంకరుని రాణి !
దశ కంఠుని వధింప దాశరధి యొనర్చె
రాజరాజేశ్వరి పూజనేడు !
కురువీరులను గూల్చి గోవర్గము మరల్చి
ధీటుగా వెలిగె కిరీటి నేడు !
కేల బాణాలూని బాలకుల్ వీరులై
ధీరులై విలసించు దినము నేడు

క్రూర కుటిలత్వ భావాల కూల్చివేసి
సకల జనముల నానంద సాగరాన
ముంచివేయుచు మమ్ముపాలించి సతము
విజయ మొనగూర్చు నీనాటి విజయదశమి

*

శ్రీకృష్ణ జన్మాష్టమి

శ్రావణమ్మున కృష్ణపక్షమ్మునందు
అష్టమిని దేవకీ గర్భమందు జనన
మందినాడవు- జగములానందపడగ
రమ్ము శ్రీకృష్ణదేవ ! మాకిమ్ము జయము.

కలువ కన్నులవాడ ! బంగారు నగలు
దాల్చి వెలిగెడివాడ ! బృందావనమున
సంచరించెడివాడ ! కృష్ణా ! వరేణ్య !
చిఱుత నవ్వుల వాడ ! రక్షించ రార !

వాసుదేవ ! నారాయణ ! వాసవాది
దేవతానుత! వైకుంఠ ! దివ్యచరిత !
పూర్ణచంద్రబింబానన ! పుణ్యపురుష !
రమ్ము శ్రీకృష్ణదేవ ! మాకిమ్ముశుభము !

దేవకీ నందనా ! దయాబ్ధీ ! ముకుంద !
శ్రీశ! భక్తప్రియా ! మురారీ ! సురేశ !
పుండరీకాక్ష ! గోవింద ! భుజగ శయన !
పరమపావన రార ! గోపాలదేవ !

కాళ్ళగజ్జెలు ఘలుఘల్లు ఘల్లుమనగ
శిరము నందున నెమ్మి పించియము గులుక
పిల్లన గ్రోవినూది వ్రేపల్లె జనుల
యుల్లమలరించు కృష్ణ ! మా కొసగు జయము.

వంశీనాదం

ఏల కనరావు మువ్వగోపాల నీవు !
ఏల వినరావు ఈ దీనురాలి పిలుపు !
నిలువజాలను నిముషమ్ము నీవులేక
బ్రతుక జాలను జగతిలో బాసినిన్ను.
కన్నులు కాయలుగాచిపోయినవి, తనువు
కొయ్యబారెను, హృదయంబు కుందెమిగుల
తరులు తళుకొత్తునే వసంతమ్ము రాక?
కలువ పూయునే జిలుగు వెన్నెలలు లేక?
నెమలి యాడునే పురివిప్పి నీలమేఘ
జాల మాకాశవీధిలో సాగకున్న?
మధుపమానని సుమధుర మధువులేల?
స్వామికందని సౌందర్య సంపదేల?
నీదు వంశీ నినాదాంబునిధి తరంగ
డోలికల జీవితపునావ తేలనిమ్ము!
నీదు పాదపద్మమ్ముల నీడలందు
విరహ సంతాపములను చల్లారనిమ్ము!
పొరలిపోయెడు నాదుఃఖఝురుల జూచి
కరుగకుండునే నీగుండె తరలిరమ్ము
ప్రణయ మధురిమ లొలికించి కనికరమున
బ్రతుకు బరువును దీర్చుమో ప్రాణనాథ!

ఏడుకొండలవాడ!

ఏడుకొండలవాడ! నాయెడదలోన
దివ్వెవై వెల్గువాడ! నాదిక్కువాడ!
మేలుచూపుల తోడ నన్నేలురేడ!
సంకట వినాశ! తిరుమల వేంకటేశ!
నిన్ను పొగడగా నేనెంత - కన్నవాడ!
నేను నీవాడ! చూపరా నీదుజాడ!
దురితములు చేసినాడ - నాదుఃఖములను
తొలగ జేసెడివాడ! నాపిలుపు వినర!
ఎల్లలోకాలనేలు నీవేడస్వామి!
నీదు పదధూళినైన నేనేడస్వామి!
తోడునీడవు నీవంచు వేడువాడ
"పాడువాడను" నన్ను కాపాడువాడ!
అంతరంగంబునన్ నడయాడువాడ!
అక్షిమధ్యంబునన్ గదలాడువాడ!
వేయి రూపాలవాడ! రావేల - నాదు
గోడు వినువాడ! సౌఖ్యంబు గూర్చువాడ!
ఎచట జూచిన కన్నీటి యెదలె గలవు
శాంతి వదనాలు లేవు ఈ జగతిలోన
స్వామి! నీదివ్యనామ సంస్మరణ చేసి
చిన్మయానందమెందెద శ్రీనివాస!

గుహుడు

రామయ్యా! నీపదములె
నా మదిలో నమ్మినాడ! నాతండ్రీ! నా
కామితముల నీడేర్పుము
శ్రీమత్ రఘువంశసోమ! శ్రీరఘురామా!
రావయ్యా! రామచంద్రా!
రావా! శ్రీరాఘవేంద్ర! రవికులచంద్రా!
రావా! సద్గుణసాంద్రా!
రావా! నాపాలిదేవ! రమ్యాకారా!
తగనా! నీస్తుతికెన్నడు
తగనా! నీచరణధూళి తలదాల్చుటకున్
తగనా! నీసేవకు రా
దగనా! నెమ్మోము జూడదగనా! రామా!
ఇనవంశోత్తమ! నేటికి
నిను కనుగొను భాగ్యమబ్బె! నిఖిలేశా! మత్
ఘన భవదుఃఖము మానిపి
జననము సఫలంబు జేసి సాకుము రామా!
దాటించెద నిను సురనది
దాటించవె నను భవాబ్ధి - దాశరథీ! నీ
సాటిగల దైవమెక్కడు
నేటికి కనరాడు - నీలనీరదమూర్తీ!

రామా! నీపదరజమున
నే మాహాత్మ్యమ్ముగలదొ - యెరుగను గానీ
నే - మును వింటిని యొకశిల
భామగ మారినదటంచు పలువురినోటన్
నా నావ మీద నీ కా
లూనిన యిదికూడ మారు నువిద్దగ కాదా!
నేనైతె భయపడుచు
న్నానింతకు ముందె కలదు నాకొక సతియున్
ఇది కూడ సతిగ మారిన
ముదితలు నాకిద్దరగుట - మోయగజాలన్
సదయా! నాబ్రతుకెంతని
మది ముదమొదవగ కడిగెద మరి నీపదముల్
నీపదములు శుభకరములు
నీపదములు అరవిరిసిన నీరేజములున్
మాపాలిటి దేవా! నీ
శ్రీపదములు కడిగి ముక్తి చెందెద స్వామీ!
శుద్ధ జలంబులు గైకొని
శ్రద్ధన్ రఘురామపాద సరసిజ యుగళిన్
తద్దయు గుహుండు కడుగగ
సిద్ధించుత! మోక్షమంచు శ్రీపతి పలికెన్

రాముడు తాటకా మద వి

రాముడు సుందర నీల నీరద

శ్యాముడు సూర్యవంశ కల

శాంబుధిసోముడు దివ్యసద్గుణ

స్తోముడు సర్వదేవ నుత

సుందర నాముడు వానిసాటి వా

డే మరి! వానితో కదన

మెందుకు పొందుకు పోయి రాగదే!

బ్రహ్మకులమునందు ప్రభవించినాడవు

సకల శాస్త్రములను చదివినావు

అతుల తపముచేసి యలరినవాడవు

పండితుడవఖండ బలము నీది!

నీకును చెప్పునంతటి మ

నీషిని మాత్రము గాకపోయినన్

నీకిటువంటి బుద్ధియు జ

నించిన దేటికో! నాశనానికో!

నాకనిపించు చున్నది వి

నంగదె! సీత "రమాలలామ" సు

శ్లోకుడు రాముడో "హరియె"

శుద్ధ మనంబున యోజసేయవే!

ఇప్పటికైన మించినది
యేమియులేదు బిరానవోయి నీ
తప్పు క్షమించుమంచు వసు
ధాసుత రాముని కప్పగించి - మా
యప్ప పదారవిందముల
కంజలి సేసిన నీకు మేలగున్
చెప్పెడిదెల్ల చెప్పితిని
చిన్నల మాటలు లెక్కసేతురో!

*

రావణ హృదయము

పుట్టితి బ్రహ్మవంశమున
పొందితినెన్నొ వరాలు - వేల్పులన్
గొట్టితి నెల్లలోకముల
గూల్చితి - నాసరివాడెవండు, వా
డెట్టులనుండు రాముడది
యెంత? బలంబది వానిదెంత? యి
ప్పట్టున యుద్ధరంగమున
వాని నెదిర్చెదనో విభీషణా!

ఖరునిన్ జంపెను నాదు చెల్లెలిని ఛీ
త్కారంబు గావించి చె
చ్చెర దర్పంబున కర్ణనాసికములన్
ఛేదించె నీరీతి దు
ర్భరమైనట్టి పరాభవంబు సలుపన్
భావ్యంబె! లంకాపురీ
శ్వరుడన్నన్ నరుడన్న వానికిటులా
స్వల్పంబుగా దోచుటల్

నేనా జంకెడి వాడగాను దివిజా
నీకంబు చెండాడెదన్
కానీ నా కనుబొమ్మలందెదియొ సా
క్షాత్కారమౌ రాముడే
శ్రీ నారాయణ మూర్తి యన్నటుల యీ
సీతే మహాలక్ష్మిగా
ఐనా రాముని చేత చచ్చుటయె మో
క్షార్థంబు నాకెప్పుడున్

నేనా దొంగనుగాను దొంగననియే
నిందించు లోకంబు నా
ప్రాణాల్ కన్నను మానమెక్కువ గదా!
రాజీవ పత్రేక్షణున్
గానన్ కన్నులు వేచియున్నయవి మే
ఘశ్యాము డేతెంచి నా
ప్రాణాల్ దీసి పరంబు జేర్చు నిజ
మౌరా! తమ్ముడా! నమ్మరా!

*

అష్టాదశ శక్తి పీఠ స్తోత్రము

లంకాపురిలో వెలసిన
శాంకరి! నీపదములెపుడు సన్నుతి జేతున్
సంకటముల బాపవె! అభ
యంకరి! త్రిజగన్నుతా! సదానందకరీ!

శ్రీకాంచీ పురవాసిని!
శ్రీకామాక్షీ! మదంబ! చిద్రూపిణి! శ్రీ
మూక మహాకవి వినుతా!
నాకంటి వెలుంగ! నీకు నతుల శతంబుల్

పిలిచిన పలికెద వంచును
లలితా! జగదంబ! సింహళాదేవీ! నిన్
పిలిచితి నా పిలుపులు విని
పలుకవె యొకసారియైన ప్రద్యుమ్నస్థా!

చాముండేశ్వరి! దేవీ!
నీ మాహాత్మ్యమ్ము బొగడ నేజాలుదునా!
నామదిలో నిను నిలిపెద
శ్రీమత్సింహాసనేశ్వరీ! క్రౌంచస్థా!

కామకళా! కమలా! శ్రీ
కామప్రద! కామరూపి! కామేశ్వరి! నీ
ధామము ముక్తికి నిలయము
శ్రీమించగ వెలుగుదువు హరిక్షేత్రమునన్

పురుహూతిక! నిను గొలిచిన
పరిహారంబగును సకల పాపంబులు - నా
మొరవినవే! ననుగనవే!
కరుణింపవె దీనజనుని ఖండేందుధరీ!

గిరిజాదేవి! భవానీ!
సురముని సంసేవ్యపాద! సుందరవదనా!
పరమానందము నొసగవె
వరదా! ఓఢ్యాణమందు వరలెడు జననీ!

మాణిక్యాంబా! నినునే
మానక పూజించి నాదు మానస సుమమున్
బూని సమర్పించెదనే
కానుకగా దక్షవాటికా పురవసతీ!

ఓయమ్మ! ఏకవీరిక!
మాయను తొలగింపజేసి మా యాపదలన్
పాయగ జేయవె నిను నే
మాయని భక్తిని దలంతు మానసమందున్

జయమస్తు! మాధవేశ్వరి!
ప్రయాగ నగరాన వెలుగు పరమేశ్వరి! నీ
దయ కలిగిన చాలును ని
శ్చయముగ భవబంధములును సమసిల్లునులే.

జ్వాలారూపిణి! నాయిలు
వేలుప! వరమీవె వైష్ణవీదేవీ! నే
చాలగ నీపదధూళిని
వాలాయము శిరముదాల్చి వందనమిడుదున్

శ్రీమంగళగౌరీ! నా
కామిత ఫలముల నొసగవె కల్యాణీ! నిన్
నేమంబున సేవించెద
శ్రీమన్మంగళ గయా పురేశ్వరి! జననీ!

శాంకరి! అభయంకరి! నా
సంకటముల బాపవే విశాలాక్షీ! ని
శ్శంకత గొలిచెద నీపద
పంకజముల వారణాసి పత్తనరాజ్ఞీ!

ఉజ్జయినీ నగరమున జ
గజ్జననీ! వెలసినావు కాళికవై నా
హృజ్జలజము నర్పించెద
ముజ్జగములనేలు తల్లి! ముక్తినొసగవే!

చల్లని చూపుల దేవీ!
కొల్లాపురిలోన నీవు కొలువైతివి, నా
యుల్లమ్మున నిన్నెంచెద
తల్లి! మహాలక్ష్మి! నన్ను దయజూడగదే.

అంబా! సుందర కాశ్మీ
రంబున కొలువైన శ్రీసరస్వతి! నా దే
శంబునకు జయము గూర్పవె
కంబుగళా! దేవదేవి! కవిజనవినుతా!

ఆలంపురీ నివాసిని!
బాలా! శ్రీ జోగుళాంబ! బాలయ కవిపై
చాలగ కరుణను చిలుకవె
నీ లీలల నెన్నగా త్రినేత్రుని వశమే!

శ్రీశైల క్షేత్రంబున
పాశస్త్యంబుగను వెలుగు భ్రమరాంబా! నీ
యాశీర్వాదము గోరెద
నా శని దూరమ్ముజేసి నను బ్రోవగదే!

ఇష్టముతో నెవ్వడు తా
నష్టాదశ శక్తుల మది నభినుతియించున్
స్పష్టముగా వానికి గల
కష్టము లన్నియు దొలంగి కలుగు సుఖంబుల్

*

ఆంధ్రభోజుడు

ఇంపుగా నీవు గంటమాడించగానె
కావ్యరంగాన భారతి కదలివచ్చు
కత్తి ఝుళిపించి నీవు పైకెత్తగానె
కదనరంగాన శత్రువర్గమ్ము కూలు.

దేశభాషల మేటిదీ తెలుగె యనుచు
విష్ణుచిత్తీయ రచన గావించినావు!
అష్టదిగ్గజ కవుల సమ్మాదరించి
'భువన విజయమ్ము' సలిపిన పుణ్యమూర్తి!

నీదు వీణామృదుల రాగ మాధురులను
ఎన్ని రసలోకములు పులకించినాయొ!
ప్రజలు మెచ్చిన నీధర్మ పాలనమున
ఎన్ని గుండెలు నిన్ను కీర్తించినాయొ!

రాజులందున నీసాటి రాజులేదు
కవులయందున నీవంటి కవియులేదు
రాజకవివీవు కవిరాజ! రాజరాజ!
అనవరతమేటికోలు నీకాంధ్రభోజ!

రామదాసు

కమ్మని రామనామమును
గానము సేసినవాడ! భద్రశై
లమ్మున మందిరమ్మును వి
రాజిల గట్టినవాడ! భూషణా
లిమ్ముగ రామచంద్రునకు
నెన్నియొ గూర్చినవాడ! నిన్ను నే
సమ్మతితోడ గొల్చెదను
సద్గుణ శీలుడవౌట గోపనా!

లంచము ముట్టవైతివి - వి
లాసపు జీవిత మెంచవైతి వే
వంచన సేయవైతివి వి
వాదము లాడగవైతి వింత నా
ప్పించక యెల్ల వారిపయి
ప్రేమసుధన్ కురిపించినావు నీ
వంచితమైన తాహసిలు
దారుడవంచు నుతింతు గోపనా!

*

కాళిదాస కవితా ప్రశంస

ఎందున్ నీ కవితా సుధారసములే
యింపొచు సొంపొచు నా
నందంబై మధురంబునై మృదువునై
నాదాను సంధానమై
డెందంబున్ పులకింప జేసెడిని - నీ
దివ్య ప్రభాసాహితీ
సౌందర్యంబును సన్నుతింప జగతిన్
శక్యంబె యెవ్వారికిన్.
నవలోకమ్మునకున్ ముదమ్మునిడు నా
నా రీతి శృంగారముల్
కవిలోకమ్మునకున్ జయమ్మిడు నలం
కారంపు సౌభాగ్యముల్
ఎవరయ్యా! ఎవరయ్య నేర్పినది నీ
వే నేర్పితో లేక ఓ
కవిరాజా! భవదీయ దివ్య కవితా
కాంతుల్ సదా నిల్చెడున్
ఎవడైనన్నెపుడైనగాని భువిలో
యిల్లాలికిన్; మేఘమున్
స్తవమున్ జేయుచు తానుక్షేమమను వా
ర్తన్ బంపునే యౌర! నీ
కవితా చాతురికిన్ జోహారులివె! నీ
కై స్వాగతం బిచ్చుచున్
యివతాళించెనురా దిగంతములు
కాళీదాస మేధానిధీ!

అష్టదిగ్గజ కవులు

కమ్మకస్తూరి వాసనల కవితనందించె 'పెద్దన్న'
'తిమ్మన్న' పద్యాలలోన తీయతేనెలు జాలువారు
సమ్మోహనమ్ము కల్గించు సత్కవిత్వమ్ము 'పింగళి' ది
యిమ్ముగ భక్తిసామ్రాజ్యమెంతయో 'ధూర్జటి' గూర్చె

చిన్నవాడవు నీవుగావు శృంగార రసము సృష్టింప
తెన్నాలి రామలింగన్న! తీరైన నీ చరిత్రమ్ము
సన్నుతింపంగనే వలయు సరసాశుధారలో నీవె
మిన్నరా! కృష్ణరాయలను మెప్పించి మెరిసిపోయితివి.

వీనుల విందైన కవిత విరిసిన విరులంటి కవిత
గానాను కూలమౌ కవిత గంగా ప్రవాహమౌ కవిత
స్నానమాడితినయ్య నీదు సత్కవిత్వంపు సోనలను
వేనోళ్ళ వినుతింతు నిన్ను విద్వత్కవీ! భట్టుమూర్తి!

మాదయ గారి మల్లన్న! మాకు నీవన్న ప్రేమన్న!
నీదు కవిత్వ రీతులను నేప్రశంసింతు నేవేళ -
సాధుశీలివి రామభద్ర! సత్కవి శ్రేష్ఠుడవీవు
మేదురమ్మైన మీకృతుల మెచ్చి జోహారు సల్పెదను.

మహాకవి దాశరథి

తాను కురిపించినది 'యగ్నిధార' యయ్యె
తాను మ్రోగించినది 'రుద్రవీణ' యయ్యె
తాను తిమిరాల తోడ యుద్ధమ్ముసేసె
శరధి యున్నంత వరకు దాశరథి నిలుచు.

తెలుగు కవితకు నీరాజనాలు పట్టి
తెలుగు జనశక్తి నతడు మేల్కొలిపినాడు
జైలుగోడ లాతని కాగితాలు నయ్యె
బొగ్గుముక్క లేఖిని యయ్యె భగ్గుమనుచు.

తాను రచియించలేదు బస్తాలకొద్ది
కాని వెలుగొందగలడు యుగాల వరకు
ఎవ్వడా మహాకవియని యెవరడిగిన
'దాశరథి దాశరథి' యందు తడుముకొనక.

*

రమ్ము మిత్రుడా!

చీకటులు నిండె జనుల హృత్సీమ లందు
వెలుగు రేఖా చయమ్ము నావిష్కరించి
జీవితమ్ముల జాగృతి సేయబూన
రమ్ము మిత్రుడ! సుస్వాగతమ్మునీకు!

కరువు పెరిగెను బ్రతుకున బరువు పెరిగె
జనము పెరిగెను దుష్టగర్జనలు పెరిగె
తరిగె మమకారభావమ్ము, తరిగె మంచి
మరచిపోయిరి మనుజులు మానవతను.

బ్రతుకవలెనన్న డబ్బు కావలెను గాని
పైసకోసమే బ్రతుకుట పాడుబుద్ధి
ధనము గలవారు బ్రతికిరే! ధరణిలోన
జ్ఞానసంపద నెవడు దోచంగ గలడు?

భరతభూమిపై జన్మించి భరతమాత
పాలుసేవించి స్వచ్ఛమౌ గాలిపీల్చి
దేశప్రగతిని గూర్చి చింతించరేల?
ప్రజల మేల్కొల్పుజాలని రచనలేల?

ఏది కవిత?

మేలి ముత్యాలవంటి పదాలతోడ
పూల తేనియవంటి అర్థాలతోడ
నిత్యనూతన సృష్టితో సత్యమైన
దదియె ఉత్తమ కవితగా నలరుచుండు
నిండుపున్నమనాటి వెన్నెలల వోలె
చల్లదనముల నీవలె నుల్లమునకు
గగనసీమ గంగా తరంగాలు దూకి
నటుల పొంగింప చేయునదదియె కవిత.
పలుకు పలుకున పలుకుల వెలది మృదుల
మంజు మంజీర నాదాలు రంజిలవలె
మాట మాటలో మల్లెల తోట వెలసి
కమ్మకమ్మని తావులు జిమ్మగవలె.
మూగవోయిన గొంతుక మ్రోగవలెను
చెమ్మగిల్లగవలె కనుదమ్ము లెలమి
తనువు పులకించగావలె కణకణాన
సురుచిరానంద లోకాలు చూపగవలె.
గాఢ తిమిరావళులను పోకార్చునట్టి
భాను బింబమువలె కైత భాసిల వలె
మిట్టపల్లాలు సరిచేసి మేదురముగ
అవని జనుల మేల్కొల్పున దదియె కవిత.

బిచ్చగాడు

గీతమో దుఃఖాశ్రు ఖాతమో ఘోర ని
ర్ఘాతమో యీ బిచ్చగాని పాట
కోపమో చైతన్య రూపమో ప్రజ్వల
ద్దీపమో యీ మర్త్య తీక్ష్ణమూర్తి
కీలమో మార్తాండగోళమో జీమూత
జాలమో యీ వీధిజనుని కన్ను
వ్యాళమో క్షుతకరవాలమో తుంగాగ్ని
శైలమో యీ దీనజనుని కరము

–అనగ నిలిచెను నా గృహాంగణము నందు
ధూళిమయమైన తనువుతో, ధూర్జటి వలె
ప్రళయ కాలాన కైలాస పర్వతాన
తాండవమ్మాడినటుల నర్తనము సేసె

*

వీర సావర్కర్

అతడు దీర్ఘ కాలమ్ము కారాగృహమున
పస్తులుండుచు గడసిన పరమయోధ !
పారతంత్ర్యమ్మునాతడు పారద్రోల
ప్రాణముల్ సమర్పించిన భవ్యమూర్తి !

దేశ స్వాతంత్ర్య సంగ్రామ దీక్షబూని
ఆంగ్ల పాలక వర్గమ్ము నదరగొట్టె
భారతోద్యమ వైప్లవ్య భావములను
నూరిపోసిన నిస్వార్థ వీరుడతడు

భరతమాత శృంఖలములు పగులగొట్ట
అతడు కన్నెర్రజేసి సైన్యంబు గూర్చె !
అతడు నిప్పులు కురిపించె నస్వతంత్ర
భావముల కూల్చివెలిగె నీ భారతమున !

ప్రధమ భారత సంగ్రామ రచనచేసి
ప్రజకు కలిగించె స్వాతంత్ర్య భావదీప్తి
అతడు వీర సావర్కరు డమరుడంచు
అక్షరార్చన చేసి నేనంజలింతు.

ఆనంద రాగాలు

వాలిపోయిన పారిజాతాల కొరకు
కూలిపోయిన శీతవృక్షాల కొరకు
రాలిపోయిన చిన్ని బుక్షాల కొరకు
బ్రతుకు బ్రతుకెల్లసేతు నంకితము సతము.

కారుమేఘాలలో చిక్కి కలతచెందు
కలికి కౌముదీ కళికల కాచుచుందు
మృదు తుషార కణమ్ముల పదిల పరతు
చివురుటాకు జొంపాలలో చిదుకకుండ.

చిమ్మచీకటి ముసుగును చీల్చివేతు
క్రుంగిపోయిన కడలిని పొంగజేతు
నిదురవోయిన వీణను నిదురలేపి
నిరుప మానంద రాగాలు కురియజేతు.

*

అనార్కలీ !

మనమొకయింత నిల్వదు నమాజును చేసెడివేళలో " కొరా
ను" ను పఠియింతమన్నను కనుంగవ కన్పడుచుందువీవె ! నే
దినమొక వేయి వర్షముల తీరుగబుచ్చుచునుండుటాయె ! రా
వె ! నెలత ! మోహనాంగి ! నిను వీడియు నేమనలేననార్కలీ !

కులము కులంబటంచు పలుకుల్ పలుకంగను లాభమేమి ! ఏ
కులమునకైన రంగులను గూర్చుడుగా భగవానుడెందునన్
కులమును గూర్చి శంకవిడు కోమలి ! మాటలు వేయియేలనే !
వలచితి నిన్నునామదిని- వారిజనేత్ర ! "కొరాను" సాక్షిగన్.

నమ్మినవాడ ! నా బ్రతుకు నమ్మినవాడ ! నపూర్వ రాజ భో
గమ్ముల కోరజాలను ! జగమ్మున నిన్నును వీడజాలి నిం
షమ్ము మనంగ జాల ననిశమ్ము వరించినవాడ నిన్ను ! రా
రమ్ము ! బిరాన నా చిఱుత ప్రాయపు కోరికలెల్ల దీర్చగన్

"ఈవొక రాజనందనుడ వేనొక నర్తకినౌదు నాకు నీ
కే విధమైన పొత్తు తగనే"నని యాత్మగలంత చెందు చు
న్నావొ! యనార్కలీ! వలపునందు కులంబులు లేవు! నీవునే
"దేవుని ముద్దుబిడ్డలము" - దివ్యపదంబులివే! వినంగదే!

నిక్కపు నాదుమాటవిని నీవును నాచెయి పట్టకున్న, నా
కిక్కడి సర్వసంపదలు నేలనె ! యేలనొ రాజ్యభోగమం
చక్కట ! నాదు జీవితము ' నాస్తి' యటంచు " ఫకీరు " నౌచునే
"మక్క"కు బోవువాడను సుమా! వినుమా! గనుమా! మనోరమా!

ఆయువరాజు మాటలకనార్కలి చేతులు మోడ్చియిట్లనెన్
" ఓయి సలీము రాజ ! దయబూనితిరేలనొ యింతదెల్యరా
దాయెను ? నేను మీ చరణదాసిని ! నన్నును మీరు గూడినన్
హేయముగాదె ! బాంధవు"లిసీ" యని హేళనమిమ్ముసేయరే !

ఓ మొగలాయి వంశ కలశోదధి చంద్ర ! నిజంబు చెప్పెదన్
నా మదిలోని మాట ! తొలినాళ్ళుగ దాచిన మేల్మిమూట ! నా
నోముల పంటవీవని మనోభవభావము పొంది యెప్పుడో
నా మది నీదు దివ్య చరణాలకు నర్పణ సేసియుంటిరా !

ఈ పలుకాలకించిన సలీము " భళా! భళి! మేల" టంచు తా
ప్రాపున జేరి చిర్నగవు వన్నెలు మోమున దొల్కరింపగా
వీపును దట్టి " నీకు భయమేలనె ! నా దొరసానివం"చు తా
నేపున కౌగిలింప- జగమెల్ల ఘటించెను పూలసోనలన్

*